క్లుప్తంగా

సీఎం కేసీఆర్‌ను కలిసిన ఎమ్మెల్యే రవీంద్రకుమార్



సీఎం కేసీఆర్‌కు వినతి పత్రం ఇస్తున్న దేవరకొండ ఎమ్మెల్యే రవీంద్రకుమార్

దేవరకొండ: సూర్యాపేటలో ఆదివారం జరిగిన ప్రగతి నివేదన సభలో దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్ సీఎం కేసీఆర్‌ను కలిశారు. దేవరకొండ మండల పరిధిలోని పడమటిపల్లి గ్రామపంచాయతీని మండలంగా ఏర్పాటు చేయాలని కోరుతూ ఆయన సీఎంకు వినతి పత్రం అందించారు. ఎమ్మెల్యే వెంట పీఏసీఎస్ చైర్మన్ పల్లా ప్రవీణ్‌రెడ్డి ఉన్నారు.

అద్దంకి-నార్కట్‌పల్లి రహదారిపై వాహనాల రద్దీ



మాడుగులపల్లి టోల్‌ప్లాజా వద్ద నిలిచిన వాహనాలు

మాడుగులపల్లి: సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఆదివారం సీఎం కేసీఆర్ పర్యటించిన నేపథ్యంలో హైదరాబాద్- విజయవాడ జాతీయ రహదారిపై ట్రాఫిక్‌ను పోలీసులు కోదాడ వద్ద ప్రత్యామ్నాయ మార్గాలకు మళ్లించారు. దీంతో అద్దంకి-నార్కట్‌పల్లి రాష్ట్ర రహదారిపై వాహనాల రద్దీ కనిపించింది. సాయంత్రం 5 గంటల నుంచి 7 గంటల వరకు కార్లు, ఇతర వాహనాలు భారీగా రావడంతో మాడుగులపల్లి టోల్‌ప్లాజా వద్ద కొద్దిసేపు ట్రాఫిక్ స్తంభించింది. టోల్‌ప్లాజా మేనేజర్ వెంకటేశ్వర్లు, సిబ్బంది రంగంలోకి దిగి వాహనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకున్నారు.


దేపావత్ లచ్చిరాంకు నివాళి



లచ్చిరాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బుసిరెడ్డి పాండురంగారెడ్డి తదితరులు

హాలియా: అనుముల మండలంలోని వీర్లగడ్డ తండాకు చెందిన దేపావత్ లచ్చిరాం ఇటీవల గుండెపోటు మృతిచెందాడు. బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ బుసిరెడ్డి పాండురంగారెడ్డి ఆదివారం వీర్లగడ్డతండాలో నిర్వహించిన లచ్చిరాం దశ దినకర్మకు హాజరై ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం లచ్చిరాం భార్య సుజాత, కుమారుడు రాహుల్, కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ నాయకుడు కుందూరు జైవీర్‌రెడ్డి కూడా హాజరై లచ్చిరాం చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో తిరుమలగిరి మండల వైస్ ఎంపీపీ యడవెల్లి దిలీప్‌రెడ్డి, సర్పంచులు ప్రభావతి, సంజీవరెడ్డి, నరేష్‌నాయక్, జనార్దన్ రెడ్డి, తుడుము ముత్తయ్య, పెద్దవూర ఉప సర్పంచ్ ప్రదీప్‌రెడ్డి, తిరుమలనాథ ఆలయ చైర్మన్ బుర్రి రాంరెడ్డి తదితరులు ఉన్నారు.

రేపు ప్రజా చైతన్య యాత్ర



ముదిమాణిక్యంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న శ్రీరాంనాయక్

అడవిదేవులపల్లి: మండలంలో మంగళవారం ప్రజా చైతన్య యాత్ర నిర్వహించనున్నట్లు తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి రమావత్ శ్రీరాంనాయక్ తెలిపారు. ఆదివారం అడవిదేవులపల్లి మండలంలోని ముదిమాణిక్యం, గోన్యతండా, దుద్యతండా, జిలకరకుంటతండా, కొత్తూరు, చింతచెట్టుతండా, మొలకచర్ల, చిట్యాల గ్రామాల్లో నిర్వహించిన సీపీఎం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ ప్రజా చైతన్య యాత్రలో భాగంగా గ్రామీణ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకోవడం జరుగుతుందన్నారు. ఈ యాత్రకు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి హాజరవుతారని పేర్కొన్నారు. ఈ చైతన్య యాత్రలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధీరావత్ రవినాయక్, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు రవినాయక్, రాగిరెడ్డి మంగారెడ్డి, సైదులు, శివ, సర్వయ్య, రాంబాబు, కోటి, హనుమంతు తదితరులున్నారు.

గ్రామ దేవతలకు పూజలు

దేవరకొండ: వర్షాలు సంవృద్ధిగా కురవాలని యాదవ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం దేవరకొండ పట్టణంలోని గ్రామ దేవతలకు నీళ్లు పోసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నక్క వెంకటేష్‌యాదవ్, నేతాళ్ల వెంకటేష్‌యాదవ్, బచ్చనమోని వెంకటయ్య, శవ్వ వెంకటయ్య, యాదయ్య తదితరులున్నారు.

రాజీవ్‌గాంధీ జీవితం యువతకు ఆదర్శం

హాలియా: దివంగత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జీవితం యువతకు ఆదర్శమని మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు గౌనీ రాజారమేష్‌యాదవ్ ఆధ్వర్యంలో ఆదివారం హాలియా పట్టణంలో నిర్వహించిన రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలను జానారెడ్డి హాజరై రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో 18 సంవత్సరాలు నిండిన వారికి ఓటు హక్కు కల్పించిన ఘనత రాజీవ్ గాంధీకే దక్కిందన్నారు. కార్యక్రమం కాంగ్రెస్ నాయకులు కుందూరు జైవీర్‌రెడ్డి, పీసీసీ సభ్యుడు చిరుమర్రి కృష్ణయ్య, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాకునూరి నారాయణగౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తుమ్మలపల్లి చంద్రశేఖర్ రెడ్డి, అనుముల, తిరుమలగిరి మండలాల అధ్యక్షులు కుందూరు వెంకట్‌రెడ్డి, కృష్ణనాయక్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చింతల చంద్రారెడ్డి, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు పగడాల నాగరాజుయాదవ్, పట్టణ అధ్యక్షుడు వెంపటి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

మిర్యాలగూడలో..

మిర్యాలగూడ: కాంగ్రెస్ పార్టీ మిర్యాలగూడ పట్టణ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతిని పురస్కరించుకొని ఆదివారం మిర్యాలగూడ పట్టణంలోని రాజీవ్‌చౌక్ వద్ద రాజీవ్‌గాంధీ విగ్రహానికి పార్టీ నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పొదిల శ్రీనివాస్, తమ్మడబోయిన అర్జున్, జిల్లా కిసాన్‌సెల్ అధ్యక్షుడు ముదిరెడ్డి నర్సిరెడ్డి, నాయకులు దేశిడి శేఖర్‌రెడ్డి, గంధం రామకృష్ణ, రమేష్‌నాయక్, బల్గూరి శ్రీనివాస్, ముశ్లగిరి కాంతయ్య తదితరులు పాల్గొన్నారు.

దామరచర్లలో..

మిర్యాలగూడ: దామరచర్లలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గాజుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆదివారం మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులు, వైద్య సిబ్బందికి పాలు, బ్రెడ్ ప్యాకెట్లు, పండ్లు అందజేశారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, పగిడి జీడయ్య, రామయ్య, గోపాల్, వసంత్, ఖాసీం, భిక్షమాచారి, తాళ్లపల్లి విజయ్ తదితరులు పాల్గొన్నారు.



హాలియా: రాజీవ్‌గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి జానారెడ్డి



మిర్యాలగూడ: రాజీవ్‌గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



కొండమల్లేపల్లి: రాజీవ్‌గాంధీ జయంతి వేడుకల్లో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు



మిర్యాలగూడ: దామరచర్ల పీహెచ్‌సీలో పండ్లు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నేతలు

తిరుమలగిరిలో..

తిరుమలగిరి(నాగార్జునసాగర్): మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలను ఆదివారం మండల కేంద్రంలో యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నాగార్జునసాగర్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు మేరావత్ మునినాయక్, మండల అధ్యక్షుడు అనుముల అంజి, నాయకులు బొమ్ము సాయినాయుడు, ధరావత్ హరినాయక్, రాజు నూరి తదితరులు పాల్గొన్నారు.

నిడమనూరులో..

నిడమనూరు: మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు ఆదివారం మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన కూడలిలో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో విశ్వనాథుల రమేష్, లక్ష్మీనారాయణ, షేక్ అజ్మత్, ప్రసాద్, పండు, పవన్ తదితరులు పాల్గొన్నారు.

త్రిపురారంలో..

త్రిపురారం: మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతి సందర్భంగా ఆదివారం త్రిపురారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పేదలకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ముడిమళ్ల బుచ్చిరెడ్డి, ఎంపీపీ గౌరవ సలహాదారు అనుముల శ్రీనివాస్‌రెడ్డి, వైస్ ఎంపీపీ మట్టయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ బిట్టు రవికుమార్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ధనావత్ భాస్కర్‌నాయక్, సలికంటి బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కొండమల్లేపల్లిలో..

కొండమల్లేపల్లి: మండల కేంద్రంలోని చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఉట్కూరి వేమన్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ దూదిపాల వేణుధర్‌రెడ్డి, నాగరాజు, అందుగుల లింగయ్య, ఖదీర్, వస్కుల బక్కులు తదితరులు పాల్గొన్నారు.



తిరుమలగిరి(నాగార్జునసాగర్)లో..



త్రిపురారంలో..



నిడమనూరులో..

ఉద్యమకారుల సంక్షేమ నిధి ఏర్పాటు చేయాలి

మిర్యాలగూడ టౌన్: మలిదశ తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులకు పెన్షన్‌తో పాటు వారి సంక్షేమం కోసం ప్రత్యేక నిధిని ఏర్పాటు చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నాయకులు మారం శ్రీనివాస్, మాలోతు దశరథనాయక్ అన్నారు. తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో ఈ నెల 27న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద నిర్వహించనున్న సదస్సుకు సంబంధించిన పోస్టర్‌ను ఆదివారం మిర్యాలగూడ పట్టణంలోని తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమకారులకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల మంజూరులో అధిక ప్రాధాన్యమివ్వాలన్నారు. ఉద్యమకారులకు హెల్త్ కార్డులు ఇవ్వాలని, నామినేటెడ్ పోస్టుల్లో తగిన ప్రాధాన్యత కల్పించాలని, వచ్చే ఎన్నికల్లో



పోస్టర్ విడుదల చేస్తున్న తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నాయకులు

సముచిత స్థానం కల్పించాలని డిమాండ్ చేశారు. 27వ తేదిన జరిగే సదస్సును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పరమేష్, కోటయ్య, వెంకటయ్య, మురళి, సైదులు, సోలమన్, రాజు, అశోక్‌కుమార్, బంటు కవిత, లక్ష్మీనారాయణ తదితరులున్నారు.

పోలీసుల తీరును నిరసిస్తూ విద్యార్థుల ర్యాలీ

మిర్యాలగూడ టౌన్: హైదరాబాద్‌లోని ఎల్‌బీ నగర్ పోలీస్ స్టేషన్‌లో గిరిజన మహిళను పోలీసులు విచాక్షణారహితంగా కొట్టడాన్ని నిరసిస్తూ ఆదివారం మిర్యాలగూడ పట్టణంలోని కేఎల్ఎన్ జూనియర్ కళాశాలకు చెందిన హాస్టల్ విద్యార్థులు స్థానికంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ మహిళా జిల్లా కార్యదర్శి బంటు కవిత, బంజారా ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు మాలోతు దశరథనాయక్, యాదవ సంఘం డివిజన్ కార్యదర్శి మురళీయాదవ్ మాట్లాడారు. తన కుమార్తె వివాహం కోసం బంధువుల వద్ద డబ్బులు తీసుకొని వెళ్తున్న గిరిజన మహిళపై పోలీసులు దొంగతనం నెపం వేసి పోలీస్ స్టేషన్‌కు తరలించి అతి దారుణంగా కొట్టారని అన్నారు. ఈ ఘటనకు బాధ్యతులైన సీఐ, ఎస్ఐలను తక్షణమే సస్పెండ్ చేసి వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఒక వైపు



మిర్యాలగూడలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

ఫ్రెండ్లీ పోలీసింగ్ అంటూనే మహిళ అని కూడా చూడకుండా అతి కిరాతకంగా కొట్టడంతో పాటు ఆమె వద్ద ఉన్న రూ.3లక్షలు తీసుకోవడం దారుణమన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా దోషులను కఠినంగా శిక్షించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ తుమ్మలపల్లి హన్మంతరెడ్డి, కిరణ్‌కుమార్, వసంత తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని నిరుపేదలకు ఇవ్వాలి

మిర్యాలగూడ: ప్రభుత్వ భూమిలో నివసిస్తూ కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్న తమకు ప్రభుత్వం ఇండ్ల పట్టాలు అందించి న్యాయం చేయాలని మిర్యాలగూడ మండలం జంకుతండా గ్రామస్తులు కోరారు. ఆదివారం మిర్యాలగూడ పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో గ్రామస్తులు మాట్లాడుతూ.. గత 30 ఏళ్లుగా జంకుతండా గ్రామంలోని ప్రభుత్వ భూమిలో దాదాపు 20 కుటుంబాలు నివసిస్తున్నామని, ఇటీవల ఆ భూమిలో గ్రామపంచాయతీ భవనం నిర్మించాలని తమని ఖాళీ చేయించే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. ఈ విషయాన్ని గతంలో ఆర్డీఓ, కలెక్టర్‌కు విన్నవించినప్పటికీ అధికారులు పట్టించుకోకపోవడంతో తాము హైకోర్టును ఆశ్రయించామన్నారు. హైకోర్టు కూడా తమకు అనుకూలంగా తీర్పు ఇచ్చినప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. జంకుతండా సర్పంచ్ మాలోతు రవీందర్



మాట్లాడుతున్న జంకుతండా గ్రామస్తులు

నాయక్ ప్రభుత్వ భూమిగా, పట్టా భూమిగా చూపి పంచాయతీ భవన నిర్మాణం పేరుతో స్వాహా చేసేందుకు కుట్ర చేస్తున్నాడని ఆరోపించారు. ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపించి న్యాయం చేయాలని కోరారు. సమావేశంలో గ్రామస్తులు బాలాజీ నాయక్, హరినాయక్, రామి, శారద, పిక్లి, పద్మ, సీతాలి, సరోజ, రజిని తదితరులు ఉన్నారు.

బీజేపీని అధికారంలోకి తీసుకురావాలి

మిర్యాలగూడ టౌన్: తెలంగాణలో బీజేపీని అధికారంలోకి తీసుకొచ్చేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషిచేయాలని ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని ఘజియాబాద్ ఎమ్మెల్యే అతుల్ గార్గ్ అన్నారు. ఆదివారం మిర్యాలగూడ పట్టణంలోని చౌదరి ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం మిర్యాలగూడ అసెంబ్లీ నియోజకవర్గంలోని పార్టీ రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల, పట్టణ స్థాయి నాయకులు, ప్రజా సంఘాల నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వంపై అసంతృప్తితో ఉన్న యువత మద్దతు సాధిస్తే బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని అన్నారు. సీఎం కేసీఆర్ వైఫల్యాలను ప్రజలకు వివరిస్తూ.. కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ చేపట్టిన సంక్షేమ పథకాలు, రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం ఇచ్చిన నిధుల గురించి ప్రజలకు తెలియజేయాలన్నారు. తెలంగాణలో అభివృద్ధి జరగాలంటే బీజేపీ అధికారంలోకి రావాలన్నారు. బూత్ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయడంతో పాటు యువత, మహిళలు, రైతులపై ప్రత్యేక దృష్టిని సారించాలన్నారు. మిర్యాలగూడ నియోజకవర్గంలో ఇప్పటి నుంచే ప్రణాళిక ప్రకారం పార్టీ కార్యకర్తలు ముందుకు వెళ్లాలన్నారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు కంకణాల శ్రీధర్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సాధినేని శ్రీనివాస్‌రావు, జిల్లా ఉపాధ్యక్షుడు రేపాల పురుషోత్తంరెడ్డి, పట్టణ అధ్యక్షుడు దొండపాటి వెంకట్‌రెడ్డి, కిసాన్ మోర్చా రాష్ట్ర కోశాధికారి కన్మంతరెడ్డి అశోక్‌రెడ్డి, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు సీతారాం రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు పులి విద్యాసాగర్, జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు కొండేటి సరిత, ఓబీసీ సెల్ పట్టణ అధ్యక్షుడు కొండేటి శేఖర్, బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శి చిలుకూరి శ్యాం, బంటు గిరి, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చిల్లంచర్ల అభి తదితరులు పాల్గొన్నారు.

నారాయణగురు జయంతి వేడుకలు

దేవరకొండ: సంఘ సంస్కర్త నారాయణగురు 72వ జయంతి వేడుకలను పురస్కరించుకొని ఆదివారం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో దేవరకొండ పట్టణం అంబేడ్కర్ విగ్రహం వద్ద నారాయణగురు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల జిల్లా అధ్యక్షుడు కంబాలపల్లి వెంకటయ్య, చింతపల్లి శ్రీనివాస్‌గౌడ్, చొల్లేటి భాస్కరాచారి, నాగయ్య, శ్రీను, రామేశ్వరమ్మ తదితరులున్నారు.



నారాయణగురు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

మాదిగ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో వన భోజనం



వన భోజనం కార్యక్రమంలో పాల్గొన్న మాదిగ ఉద్యోగ సంఘం సభ్యులు

మిర్యాలగూడ టౌన్: మాదిగ ఉద్యోగుల సంఘం డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం మిర్యాలగూడ పట్టణంలోని అద్దంకి-నార్కట్‌పల్లి బైపాస్‌లోని అగ్రిగోల్డ్ వెంచర్‌లో కార్తీక వనభోజనం నిర్వహించారు. అనంతరం ఆత్మీయ సమ్మేళనానికి ఉద్యోగులు కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఈసీ సభ్యుడు రేగూరి రాము, వర్కింగ్ ప్రెసిడెంట్ వంగూరి వీరయ్య, బచ్చలకూరి సైదులు, బొంగరాల సాగరయ్య, వడ్డే రాజు, ఈట నాగేందర్, సైదులు తదితరులున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మర్రిగూడ: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలోని హిందీ, ఇంగ్లిష్ టీజీటీ ఖాళీలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శివస్వరూపరాణి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంగ్లిష్ టీజీటీ వారికి ఎంఏ ఇంగ్లిష్, బీఈడీ, హిందీ టీజీటీ వారికి హిందీ ట్రైనింగ్, అనుభవం కలిగి ఉండాలన్నారు. సోమవారం దరఖాస్తుల స్వీకరణ, మంగళవారం డెమో, అర్హత పత్రాల పరిశీలించనున్నట్లు తెలిపారు.

జాబ్‌మేళాకు విశేష స్పందన

హాలియా: ఏకే ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ నాయకుడు కట్టెబోయిన అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం హాలియా పట్టణంలోని ఎంసీఎం డిగ్రీ, త్రివేణి ఒకేషనల్ కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన జాబ్ మేళాకు నిరుద్యోగ యువత నుంచి విశేష స్పందన లభించింది. ఈ జాబ్ మేళాకు 200 మందికి పైగా హాజరు కాగా సుమారు 100 మంది వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఏకే ఫౌండేషన్ చైర్మన్ కట్టెబోయిన అనిల్‌కుమార్ మాట్లాడుతూ.. నాగార్జునసాగర్ నియోజకవర్గంలో ప్రతి నిరుద్యోగ యువతకి ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యంగా ఏకే ఫౌండేషన్ పనిచేస్తుందన్నారు. అనంతరం జాబ్ మేళాలో ఎంపికైన వారికి ఆయన నియామక పత్రాలు అందజేశారు.



జాబ్‌మేళాలో ఎంపికైన వారికి నియామక పత్రాలు అందజేస్తున్న అనిల్‌కుమార్

కార్యక్రమంలో ఆయా కంపెనీల ప్రతినిధులు రాజ్ కుమార్‌రెడ్డి, శ్రీనివాస్, రాజుయాదవ్, ఆకాంక్ష స్కూల్ ప్రిన్సిపాల్ రవికుమార్‌యాదవ్, మున్నూరు కాపు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు తుమ్మురుగోటి రమేష్, ఫౌండేషన్ సభ్యులు తదితరులు ఉన్నారు.

విద్యారంగ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

హాలియా: విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వ పూర్తిగా విఫలమైందని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఆకారపు నరేష్ అన్నారు. సమస్యల పరిష్కారం కోసం పరిష్కారం కోసం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించనున్న కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఆదివారం హాలియా పట్టణంలోని సుందరయ్య భవనంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న సుమారు రూ. 5177 కోట్ల స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్లలో సౌకర్యాలు లేక విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. హాస్టల్ విద్యార్థులకు మెస్ చార్జీలు పెంచుతున్నామని ప్రభుత్వం ప్రకటన చేసినా జీఓ విడుదల చేయకపోవడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు నల్లబెల్లి జగదీష్, కోరే రమేష్, నాయకులు చందు, నవీన్, బ్రహ్మం, వెంకటేష్ తదితరులు ఉన్నారు.

మెస్ చార్జీలు పెంచాలి..

వేములపల్లి: విద్యారంగ సమస్యల పరిష్కారానికి



హాలియా: మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఆకారపు నరేష్

సోమవారం చేపట్టే చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఖమ్మంపాటి శంకర్ అన్నారు. ఆదివారం వేములపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన ఎస్ఎఫ్ఐ మండల మహాసభకు ఆయన హాజరై మాట్లాడారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెస్‌చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. గురుకుల పాఠశాలలకు సొంత భవనాలు నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో కొర్ర సైదానాయక్, సంపత్, గిరీష్, శివ, సుశాంత్‌రెడ్డి, గోపి, సంజీవ, రవివర్మ, సాయి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మాడుగులపల్లిలో..

మాడుగులపల్లి: మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన ఎస్ఎఫ్ఐ మండల మహాసభలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఖమ్మంపాటి శంకర్ పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో విద్యార్థులకు, నిరుద్యోగులకు తీరని అన్యాయం జరుగుతోందని ఆరోపించారు. చలో కలెక్టరేట్‌ను విజయవంతం చేయాలని అన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి కొర్ర సైదానాయక్, డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు పుల్లెంల శ్రీకర్, పఠాని శ్రీను, పలువురు మండల నాయకులు పాల్గొన్నారు.

నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాలి

పెద్దఅడిశర్లపల్లి: నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి బుడిగ వెంకటేష్ అన్నారు. ఆదివారం పెద్దఅడిశర్లపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన ఎస్ఎఫ్ఐ మండల మహాసభకు ఆయన హాజరై మాట్లాడారు. కేంద్రం తీసుకొస్తున్న నూతన జాతీయ విద్యావిధానం వల్ల విద్యార్థులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు దున్న రవి, కార్యదర్శి రాము, ముని, నరేందర్, గణేష్, అనిల్, చరణ్ తదితరులున్నారు.

కాంగ్రెస్‌తోనే ప్రజా సంక్షేమ పథకాలు



ఇంటింటికి కాంగ్రెస్ కార్యక్రమంలో పాల్గొన్న యువజన కాంగ్రెస్ నాయకులు

పెద్దఅడిశర్లపల్లి: వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే ప్రజా సంక్షేమ పథకాలు అందుతాయని యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రమేష్‌నాయక్ అన్నారు. ఆదివారం పెద్దఅడిశర్లపల్లి మండలంలోని పలుగతండాలో ఇంటింటికి కాంగ్రెస్ కార్యక్రమంలో భాగంగా ఆయన ప్రచారం నిర్వహించి మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే వితంతువులు, వృద్ధులకు రూ.4వేల పింఛన్, కౌలు రైతులకు సైతం రైతుబంధు పథకాలు ప్రజలకు అందుతాయన్నారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ నాయకులు బోడ్యానాయక్, పుల్‌సింగ్, సీతారాం, లక్ష్మణ్, రమేష్, శ్రీను తదితరులున్నారు.

మూలికా వైద్యాన్ని ప్రోత్సహించాలి

మిర్యాలగూడ: ఆయుర్వేద మూలికా వైద్యాన్ని ప్రోత్సహించాలని మూలికా వైద్య నిపుణుడు పండిట్ శ్రీనివాస్‌గురూజీ అన్నారు. ఆదివారం మిర్యాలగూడ పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం మూలికా వైద్యం చేసే వారిని గుర్తించి ఐదేళ్ల పాటు అనుమతి ఉండేలా సర్టిఫికెట్ ఇవ్వడం అభినందనీయమన్నారు. అంతరించిపోతున్న సాంప్రదాయ మొక్కలను సంరక్షించుకుంటూ మూలికా వైద్యాన్ని కాపాడుకోవాలని కోరారు.

పకడ్బందీగా దరఖాస్తుల విచారణ

మిర్యాలగూడ: జీఓ నంబర్లు 58, 59 ప్రకారం ఇళ్ల క్రమబద్ధీకరణకు చేసుకున్న దరఖాస్తుల విచారణను పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు మిర్యాలగూడ ఆర్డీఓ బి. చెన్నయ్య అన్నారు. ఆదివారం మిర్యాలగూడలోని ఇందిరమ్మకాలనీలో దరఖాస్తుదారుల ఇళ్లకు వెళ్లి విచారణ చేపట్టి వారితో మాట్లాడారు. మిర్యాలగూడ డివిజన్ వ్యాప్తంగా 58 జీఓ కింద 2,103, 59 జీఓ కింద 4,963 కలిపి మొత్తం 7,066 దరఖాస్తులు వచ్చాయన్నారు. వీటిలో ఇప్పటివరకు 4,193 దరఖాస్తులను క్షేత్రస్థాయిలో విచారించగా 2,873 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, మరో మూడు, నాలుగు రోజుల్లో మొత్తం దరఖాస్తుల విచారణ పూర్తి చేస్తామన్నారు. దరఖాస్తుల కోసం డివిజన్ పరిధిలోని మిర్యాలగూడ, నాగార్జునసాగర్ నియోజకవర్గాల్లో తహసీల్దార్ల ఆధ్వర్యంలో మొత్తం



దరఖాస్తుదారులను విచారిస్తున్న ఆర్డీఓ చెన్నయ్య

15 బృందాలు ఏర్పాటు చేశామన్నారు. అనంతరం దరఖాస్తుల విచారణలో సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఇన్‌చార్జి తహసీల్దార్ అనిల్ కుమార్ సిబ్బంది ఉన్నారు.

'యాదవ యుద్ధభేరి' పోస్టర్ ఆవిష్కరణ

మాడుగులపల్లి: హైదరాబాద్‌లోని నాగోల్‌లో గల శుభం కన్వెన్షన్ హాల్‌లో ఈ నెల 25న నిర్వహించనున్న యాదవ యుద్ధభేరి సభను విజయవంతం చేయాలని యాదవ విద్యావంతుల వేదిక జిల్లా కార్యదర్శి ఊరిబండి శ్రీనివాస్‌యాదవ్ పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలో యాదవ సంఘం నాయకులతో కలిసి యుద్ధభేరి వాల్‌పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. జనాభా దామాషా ప్రకారం అన్ని రాజకీయ పార్టీలు యాదవ సామాజిక వర్గానికి 22 అసెంబ్లీ, 3 లోక్‌సభ, 2 రాజ్యసభ, 7 ఎమ్మెల్సీ సీట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. యాదవులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి 18 శాతం నిధులు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు సైదులు, వంశీ, నాగరాజు, వెంకన్న, గంగరాజు, శంకర్, శ్రీను, కొంగరాజు తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న యాదవ సంఘం నేతలు

ఆర్థికసాయం అందజేత

తిరుమలగిరి(నాగార్జునసాగర్): మండల కేంద్రానికి చెందిన ఐతరాజు మణెమ్మ అనారోగ్యంతో ఆదివారం మృతిచెందింది. ఈ విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు పగడాల సైదులు మణెమ్మ నివాసానికి చేరుకొని ఆమె మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం మృతురాలి కుటుంబ సభ్యులకు అంత్యక్రియల నిమిత్తం రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో మునగాల నాగేశ్వర్‌రావు, పాతనబోయిన భాస్కర్, మల్లయ్య తదితరులు ఉన్నారు.